అటకెక్కిన 'ట్రక్ టెర్మినల్'



వందడుగుల రోడ్‌లో నిలిపిన భారీ వాహనాలు

- కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు
- రహదారిపైనే భారీ వాహనాలు
- రాకపోకలకు అవస్థలు
- తరచూ ప్రమాదాలు

గాజువాక ప్రాంతంలో ట్రక్ టెర్మినల్ నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. స్థల సేకరణ నుంచి ఒక్క అంగుళం కూడా ముందుకు కదలడం లేదు. దీంతో భారీ వాహనాలు రహదారులపై బారులు తీరుతున్నాయి. రాకపోకలకు దారిలేక వాహనచోదకులకు నరకం చూపిస్తున్నాయి.

గాజువాక: ఇరుకురోడ్లతో నిత్యం రద్దీగా ఉండే గాజువాకలో వాహనాల పార్కింగ్ సమస్యగా మారింది. భారీ వాహనాలను సైతం జనావాసాల మధ్య, ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయంతో పాటు ప్రమాదాలకు కారణమవుతోంది.

గాజువాక ప్రాంతంలో ట్రక్ టెర్మినల్ (పార్కింగ్ టెర్మినల్) లేకపోవడంతో ట్యాంకర్లు, లారీలు, ట్రాలర్ల పార్కింగ్ సమస్యాత్మకంగా తయారైంది. పోలీసుల తాత్కాలిక అనుమతితో శ్రీనగర్ వద్ద, షీలానగర్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో వాహనాలను నిలుపుతున్నారు. అనధికారికంగా చినగంట్యాడలోని కణితి రోడ్‌లో, ఇక్కడి 100 అడుగుల రోడ్‌లో నిలిపివేస్తున్నారు. కూర్మన్నపాలెంలోని రేడియో టవర్స్ సమీపంలో గల జాతీయ రహదారిపైన వాహనాలను నిలిపివేస్తుండటంతో నిత్యం ప్రజలకు అసౌకర్యం ఏర్పడటంతో పాటు తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. అనధికార పార్కింగ్‌లు వద్దని ట్రాఫిక్ పోలీసులు చెప్పినా వినే పరిస్థితి లేదు. సరైన స్థలం లేదనే కారణంతో ట్రక్ టెర్మినల్ వ్యవహారం వెనక్కి పోయింది. దీంతో పరిస్థితి మరింత జటిలమైంది. దీన్ని కూడా ట్రాఫిక్ పోలీసులు సొమ్ము చేసుకొంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పలు సంస్థలు, పరిశ్రమల్లో లోడింగ్, అన్‌లోడింగ్‌లకు వివిధ రాష్ట్రాలకు చెందిన లారీలు ఇక్కడికి వస్తుంటాయి. దీనికోసం గాజువాకతో పాటు పరిసర ప్రాంతాల్లో లారీ సప్లై కార్యాలయాలు సుమారు 250 నడుస్తున్నాయి. పార్కింగ్ కోసం టెర్మినల్ ఉండి ఉంటే, వాటిని తమ సమయం వరకు పార్కింగ్‌లోనే నిలిపి ఉంచుకుంటారు. పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ఖాళీ లారీలను సైతం నేరుగా టౌన్‌లోకి తీసుకొచ్చి రోడ్లపై నిలిపి ఉంచుతున్నారు. భారీ లారీలు జనావాసాల మధ్యలో గల రోడ్లపైకి వచ్చేస్తుండటంతో తరచూ ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఆయా లారీలపై పోలీసు కేసులు కూడా నమోదవుతున్నాయి. లారీలను పట్టణంలోకి రాకుండా చర్యలు చేపట్టడం కోసం ట్రక్ టెర్మినల్ ఏర్పాటు చేయాలని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణయించారు. దీనికోసం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను 50 ఎకరాలు అడగాలని ప్రతిపాదించారు.

అది కాకపోతే, సబ్బవరం ప్రాంతంలో ఏర్పాటు చేయాలని భావించారు. ఈ ప్రతిపాదనలు కూడా ప్రస్తుతం అటకెక్కినట్టు సంబంధిత లారీ సప్లై యజమానులు చెబుతున్నారు. ట్రక్ టెర్మినల్ ఏర్పాటైతే పార్కింగ్ సమస్య తగ్గుతుందని పేర్కొంటున్నారు.

టెర్మినల్ కోసం పోరాడుతూనే ఉన్నాం

భారీ వాహనాల పార్కింగ్ కోసం టెర్మినల్ ఏర్పాటు చేయాలని ఏడెనిమిదేళ్లుగా పోరాడుతున్నాం. దీనికోసం ర్యాలీలు, ఆందోళనలు కూడా చేశాం. గతంలో ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ కూడా మాట ఇచ్చారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. టెర్మినల్ లేకపోవడంతో అనధికార పార్కింగ్ కేసులను కూడా ఎదుర్కొంటున్నాం.

– అన్నంనీడి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు, విశాఖ జిల్లా లారీ అసోసియేషన్

డ్రైవర్లపై దాడులు

పార్కింగ్ టెర్మినల్ లేకపోవడంతో మా లారీ డ్రైవర్లపై దాడులు కూడా జరుగుతున్నాయి. ఎక్కడో ఖాళీ చూసుకుని వాహనాన్ని ఆపితే కొంతమంది వచ్చి దాడి చేసి లారీలో డీజిల్‌తో పాటు డ్రైవర్ వద్ద డబ్బులను కూడా లాక్కొని వెళ్లిపోతున్నారు. మాకు టెర్మినల్ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఇస్తే ఈ దాడులు ఉండవు. టౌన్‌లో అనధికార పార్కింగ్‌లు కూడా తగ్గిపోతాయి. గతంలో మాకు స్టీల్‌ప్లాంట్ నుంచి స్థలం ఇప్పిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పారు. కార్యరూపం దాల్చలేదు. సబ్బవరం ప్రాంతంలో ఇస్తామన్నారు. అది కూడా ముందుకు కదల్లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ముందుకు రావాలి.

– వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు, విశాఖ జిల్లా లారీ అసోసియేషన్

సెయిల్‌లో విలీనంతోనే శాశ్వత పరిష్కారం

- స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్
- 1268వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



దీక్ష శిబిరం వద్ద ప్రసంగిస్తున్న మంత్రి రాజశేఖర్

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. తద్వారా స్టీల్‌ప్లాంట్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1268వ రోజుకు చేరుకున్నాయి.

దీక్షలో బ్లాస్ట్‌ఫర్నేస్, సింటర్ ప్లాంట్, వాటర్ మేనేజ్‌మెంట్, ఈఎస్‌ఎఫ్ విభాగాలకు చెందిన ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దీక్ష శిబిరంలో రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకులు లేకపోవడం వల్ల పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయలేకపోతున్నామన్నారు. తద్వారా ప్లాంట్ నష్టాల్లోకి నెట్టబడిందని పేర్కొన్నారు. సెయిల్‌లో విలీనానికి ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆఫీస్ బేరర్ పూతి పోతయ్య రెడ్డి, నీరుకొండ రామచంద్రరావు, ఎస్.ఎ.నాయుడు, బీఎఫ్ విభాగం నాయకులు పోలీసు నాయుడు, పాల అప్పలరెడ్డి, నల్ల రవి, పి.వి.నగేష్, ఈఎస్‌ఎఫ్ నాయకులు గొందేశి ప్రభాకరరెడ్డి, మింది దేవుడు, సింటర్ ప్లాంట్ నాయకులు డి.వి.కె.రాజు, కె.వి.రమణ, ఎం.పెంటారావు, వాటర్ మేనేజ్‌మెంట్ నాయకులు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం, ఎస్‌ఐ మన్మథరావు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక డ్రైవర్స్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగలు చోరీకి యత్నించారు. అలికిడికి ఇరుగుపొరుగు వారు లేవడంతో తాము తెచ్చుకున్న బైక్‌ను కూడా అక్కడే వదిలేసి వెళ్లారు. ఘటనకు సంబంధించి గాజువాక క్రైం ఎస్‌ఐ మన్మథరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక డ్రైవర్స్‌కాలనీలో నివాసం ఉంటున్న మోహనరావు కుటుంబ సభ్యులతో అమెరికా వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో గురువారం అర్ధరాత్రి సమయంలో దొంగలు చోరీకి యత్నించారు. ఇంటి తాళాలు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించిన వారు బీరువాను తెరిచి అంతా వెతికారు. ఇంట్లో వస్తువులన్నీ చెల్లా చెదురు చేసినా ఏమీ దొరకపోవడంతో కారిడార్‌లో ఉన్న కారును దొంగిలించడానికి ప్రయత్నించారు. కానీ, ఇంటి గేటు ముందు ఇతర వాహనాలన్నీ అడ్డుగా ఉండటంతో కారు తీయడానికి వీలు పడలేదు. అలికిడికి ఇరుపొరుగు వారు లేవడంతో దొంగలు వారితో తెచ్చుకున్న బైక్‌ను కూడా అక్కడే వదిలి పారిపోయారు. ఆ బైక్ కూడా దొంగిలించి తెచ్చిందేనని ఎస్‌ఐ తెలిపారు. దీనిపై మోహనరావు బంధువులు గాజువాక క్రైం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆయన క్లూస్ టీంతో వేలి ముద్రలు సేకరించేందుకు ప్రయత్నించినా ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదన్నారు. వస్తువులు ఏమీ పోకపోవడంతో చోరీపై ఎవరూ ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ తెలియజేశారు.

కుప్తంగా

శాకంబరిగా పద్మావతి అమ్మవారు



కూరగాయల అలంకరణలో పద్మావతి అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో పద్మావతి అమ్మవారు శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని 18 రకాల కాయగూరలతో అలంకరించి, పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న కరణంరెడ్డి

గాజువాక : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ఎంఆర్‌పీఎస్ నేతలతో కలిసి గాజువాక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను చేపట్టాలని కోరుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎన్నో ఏళ్లనుంచి పోరాటం చేస్తున్నారన్నారు. ప్రధానమంత్రి మోదీ చొరవ, ఎన్డీఏ కూటమి నేతల సహకారంతో ఆ ఉద్యమానికి ఫలితం దక్కిందన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, ఇది హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు కింతాడ రాజశేఖర్ మాదిగ, ములకలపల్లి ప్రకాష్, ములకలపల్లి ఈశ్వరరావు, పెంటారావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక : కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగి పడిన ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకోవడం కోసం సీపీఎం గాజువాక జోన్ నాయకులు శుక్రవారం విరాళాలను సేకరించారు. ఈ ఘటనలో 250 మంది మృతి చెందారని, వేలాదిమంది నిరాశ్రయులయ్యారని ఆ పార్టీ గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు పేర్కొన్నారు. ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ పాతగాజువాక నుంచి కొత్తగాజువాక వరకు మెయిన్ రోడ్‌లో గల చిరు వ్యాపారులు, షాపుల యజమానుల నుంచి విరాళాలను సేకరించారు. ఈ వయనాడ్ సంఘటనను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా పరిగణించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, నూకేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు, డి.అప్పారావు, కె.కిరీటం, శివానంద తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్–5 జ్ఞానాపురం కార్యాలయంలో ఈ నెల 5న నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రకటనలో వేలం ఎప్పుడు నిర్వహించేదీ తెలుపుతామని, పూర్తి వివరాలకు జోన్–5 జోనల్ కార్యాలయ పర్యవేక్షకుడిని పని వేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రాంనగర్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గాజువాక ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. 2024 స్వచ్ఛ సంకల్ప్, ఆర్‌జీబీ క్యాంపెయిన్‌లో భాగంగా 68వ వార్డు రాంనగర్‌లో ఫ్రైడే– డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులకు సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ జ్వరాల వ్యాప్తి, తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, సీవో ఎల్.వి.లక్ష్మి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.అప్పలరాజు, ఆర్పీలు, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

'నిజాయితీతో వర్గీకరణ చేయాలి'



సమావేశంలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

ఉక్కునగరం: ఎస్సీ వర్గీకరణను కులగణన ఆధారంగా నిజాయితీతో చేయాలని స్టీల్‌ప్లాంట్ మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు ఆర్థిక వెనుబాటుతనాన్ని గుర్తించి జనాభా నిష్పత్తి ప్రకారం అందరికీ న్యాయం చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా చేయాలి తప్ప భిన్నంగా ఏది చేసినా మాల మహానాడు తరపున వ్యతిరేకించి ఉద్యమం చేస్తామన్నారు. ఆంధ్ర, తెలంగాణ ముఖ్యమంత్రులు, ప్రధానికి తీర్మానాలను లిఖిత పూర్వకంగా తెలపాలని తీర్మానించారు. అదే విధంగా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ వేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఫైల్ చేయాలని తీర్మానించారు. బయ్యే మల్లయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మాటూరి శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాస్, పరమట సత్యనారాయణ, సత్యనారాయణ, గంటా రాజు, పుల్లారావు, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

లెప్రసీ కేసుల సర్వే పరిశీలన

గాజువాక పీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ దేవసాగర్



గాజువాక వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమైన డాక్టర్ దేవసాగర్

గాజువాక : గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న లెప్రసీ కేసుల సర్వేను ఆ విభాగ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.దేవసాగర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గాజువాక పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్ మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలోని 11 సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న సర్వే వివరాలను వివరించారు. ఈ సర్వేలో 15 బృందాలు పాల్గొంటున్నాయని, ఇప్పటివరకు 23 అనుమానాస్పద కేసులను గుర్తించగా, అవి లెప్రసీ కేసులు కాదని తాను నిర్ధారించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.నాగ అప్పారావు, జి.రాము, స్టేట్ కన్సల్టెంట్ కె.సత్యవతి, డిస్ట్రిక్ట్ న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

సీతమ్మధార : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో ప్రతినిధులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి మాట్లాడుతూ రానురాను సంక్షేమ కళాశాలల హాస్టళ్లలో సమస్యలు తీవ్రమవుతున్నాయని అన్నారు. విశాఖ జిల్లావ్యాప్తంగా 18 బీసీ కళాశాలల హాస్టళ్లు ఉండగా దశాబ్దాలు గడుస్తున్నా మూడు హాస్టళ్లకు తప్ప మిగతా వాటికి సొంత భవనాలు లేవని అన్నారు. అలాగే హాస్టళ్లలో సరైన తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులే బయటి నుంచి టిన్నులతో నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. సీజనల్ వ్యాధులతో విద్యార్థులు బాధలు పడుతున్నారన్నారు. గతంలో పాత బియ్యం హాస్టళ్లకు సరఫరా చేస్తాం అని చెప్పినప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని విద్యార్థులు పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సకాలంలో మెస్ బిల్లులు విడుదల కాక మెనూ అమలు చేయలేమని వార్డెన్లు తెగేసి చెబుతున్నారని తెలిపారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని హాస్టళ్లలో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్. రుద్రి, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వర్, లక్ష్మణ్, సతీష్, మధు, లోకేష్, జానకి, హాస్టల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాల ఆవశ్యకతను బాహుబలి చిత్ర సన్నివేశం ద్వారా వివరిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు



నర్సింగ్ విద్యార్థులతో సీడీపీవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, సిబ్బంది, సచివాలయ పోలీసులు

సీడీపీవో నీలవేణి

అక్కిరెడ్డిపాలెం: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని పెందుర్తి సీడీపీవో డి.నీలవేణి అన్నారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యానికి ఇవి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో క్లోజ్ ద గ్యాప్ టీంతో ఈ నెల 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రంలోని గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. పుట్టిన 6 నెలల వరకు బిడ్డకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని, అనంతరం రెండేళ్ల వరకు అదనపు ఆహారం అందించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కాంప్లిమెంటరీ ఫీడింగ్, వెయ్యి రోజుల సంరక్షణ, మిషన్ వంద రోజులు, మహిళా సంరక్షణ, బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

షీలానగర్‌లోని కాలేజ్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు వారోత్సవాల్లో వినూత్న కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో నిర్వహించారు. అనంతరం తల్లిపాల ఆవశ్యకతను బాహుబలి చిత్రంలోని కొన్ని సన్నివేశాల ద్వారా వివరించారు. పులిపాలు, తల్లిపాలపై హాస్యభరిత ప్రదర్శన ఇచ్చారు. విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. బిడ్డలకు ఎలా పాలు పెట్టాలో వివిధ రూపాల్లో చిత్రాల ద్వారా వివరించారు. డాక్టర్లచే అవగాహన కల్పించారు. అనంతరం సీడీపీవో చేతుల మీదుగా గర్భిణులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రుక్సానా బేగం, సచివాలయ పోలీసులు గాయత్రి, పూర్ణిమ, అంగన్‌వాడీ వర్కర్లు పి.దుర్గాబాయి, సీతాలక్ష్మి, ఏడబ్లూహెచ్‌లు వెంకటలక్ష్మి, ఈశ్వరమ్మ, కాలేజ్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ యాజమాన్యం, గ్రామ నాయకుడు సంగ్రాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం

పెదగంట్యాడ: తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని దేవాడ పీహెచ్‌సీ వద్ద శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ఈ నెల 7 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ అన్నపూర్ణ, బి.గోపాలం, రమణమ్మ, విజయభాను, దేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదగంట్యాడ పీహెచ్‌సీ పరిధిలో..

తల్లి పాలలోనే వ్యాధి నిరోధక శక్తితో పాటు మంచి పోషకాలు ఉంటాయని మండల విద్యా శాఖాధికారులు ఇ.శ్రీనివాసరావు, కె. రమణాజీ, పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ హేమలత అన్నారు. మండలంలోని అయ్యన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తనకాల సత్యనారాయణ, వేణు, జగదాంబ, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి ముసలినాయుడుపాలెంలో..

జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని రెడ్డి ముసలినాయుడపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ కె.లక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో నీలవేణి



దేవాడ పీహెచ్‌సీ వద్ద అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా



అయ్యన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద అవగాహన కల్పిస్తున్న ఎంఈవోలు, వైద్యాధికారులు

గంటలో దొంగను పట్టుకున్న పోలీసులు



మహిళకు ఆభరణం అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ : ఆటోలో ఒక మహిళ నుంచి బంగారు ఆభరణాన్ని కొట్టేసిన వ్యక్తిని గంటలోనే పోలీసులు పట్టుకుని బాధితురాలికి నగ అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం సాయంత్రం దొండపర్తి ప్రాంతానికి చెందిన వరలక్ష్మి అనే మహిళ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న లలితా జ్యుయలర్స్‌లో పావు తులం బంగారు ఆభరణం కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆ నగను కొట్టేశాడు. దీంతో ఆమె వెంటనే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీసీపీ (క్రైమ్) వెంకటరత్నం పర్యవేక్షణలో ఒక ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి గంటలోనే ఆ వ్యక్తిని పట్టుకుని నగ స్వాధీనం చేసుకున్నారు. దాన్ని సీపీ చేతుల మీదుగా బాధితురాలు వరలక్ష్మికి శుక్రవారం అందజేశారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరకులు



పేద కుటుంబానికి సరకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెదగంట్యాడ: అమ్మ వాసవీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా ట్రస్ట్ సభ్యుడు బొడ్డి సూర్యనారాయణమూర్తి జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆయన ఆర్థిక సాయంతో నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందించారు. ఆయన తండ్రి బొడ్డి ఈశ్వరరావు చేతులు మీదుగా వీటిని శుక్రవారం అందజేశారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో గల వాసవీ పంచాయతన దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.